క్లుప్తంగా

అయ్యప్ప దీక్ష చేపట్టిన ఎమ్మెల్యే పొన్నాడ



తాళ్లరేవు అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్ష తీసుకున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. తాళ్లరేవు బైపాస్ రహదారిలోని అయ్యప్పస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, దీక్షను చేపట్టారు. ఎమ్మెల్యే పొన్నాడ 40 రోజుల పాటు ఈ దీక్షలో ఉండి, స్వామివారి దర్శనానికి శబరిమలై వెళతారు. దీక్ష తీసుకున్న వారిలో ఎమ్మెల్యే పొన్నాడతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, దొరబాబు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు ఉన్నారు.

ఆటోలో తరలిస్తున్న బీర్ల కేసులు పట్టివేత



స్వాధీనం చేసుకున్న బీరు బాక్సులతో పోలీసులు

యానాం: అక్రమంగా యానాం నుంచి ఆటోలో తరలిస్తున్న 17 కేసుల టిన్ బీర్లను పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎస్సై శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సావిత్రి నగర్‌కు చెందిన మల్లాడి కామరాజు ఆంధ్రా ప్రాంతానికి ఈ బీర్లను ఆటోలో తరలిస్తున్నాడు. మొత్తం రూ.36,864 విలువైన 17 కేసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఎక్సైజ్ శాఖకు అప్పగించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ

అల్లవరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన ఆవశ్యకతను తెలుపుతూ గురువారం బోడసకుర్రులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ ఉన్నత చదువులను అభ్యసించాలని, అదే వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని ఆమె పేర్కొన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం సుభాషిణి, దొమ్మేటి కృష్ణవేణి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న బాబానగర్ ప్రజల తాగునీటి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు కోరారు. మానవ హక్కుల జిల్లా వేదిక ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు గురువారం గ్రామస్తులతో సమావేశమయ్యారు. సమస్యలపై పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావును వివరణ కోరగా, గ్రామంలో ఉన్న ఓహెచ్‌ఆర్ నీటిని మోటార్ల సాయంతో కొందరు తోడుతున్నారని, దీంతో గ్రామంలో నీటికొరత ఏర్పడిందని తెలిపారు.

దాతల సేవలు భేష్



డీఎస్పీ, సీఐలతో భిక్ష స్వీకరిస్తున్న శ్రీకాంత్

అమలాపురం రూరల్: ఈదరపల్లిలోని శ్రీకోనసీమ మహా శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధిలో అయ్యప్ప, భవానీలు దాతల సాయంతో ఉచిత భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎస్పీ అంబికా ప్రసాద్ అన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా, అయ్యప్ప మాల ధరించిన డాక్టర్ శ్రీకాంత్ ఆలయంలో గురువారం విశేష పూజలు చేశారు. అనంతరం స్వాములకు ఉచిత భిక్ష ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ వీరబాబుతో కలిసి శ్రీకాంత్ భిక్ష స్వీకరించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మంగళంపల్లి అంజిబాబు, సరెళ్ల రామకృష్ణ, కుడుపూడి అశోక్, దాసరి డేవిడ్, నల్లా చిట్టిబాబు, నక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి తెప్పోత్సవం

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనకదుర్గా అమ్మవారి తెప్పోత్సవం కన్నులపండువగా సాగింది. గురువారం రాత్రి స్థానిక తామరచెరువు మెట్ల సత్యనారాయణ రావు పార్కులో ఉన్న చెరువులో ఈ తెప్పోత్సవం జరిగింది. కౌన్సిలర్ శెట్టి నాగదుర్గా ఆదిబాబు దంపతులు ఈ కార్యక్రమానికి సహకరించారు.

మిత్ర పురుగులకు చేటు

- విచ్చలవిడిగా క్రిమిసంహారక మందుల వినియోగం
- రైతుల ధోరణితో అంతరించిపోతున్న వైనం



వరిచేనుపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

అమలాపురం రూరల్: పంటలను ఆశించే చీడ పురుగులను నివారించి, మేలు చేకూర్చే మిత్ర పురుగులు అంతరించిపోతున్నాయి. పంటలను కీడు చేసే శత్రు పురుగులను ప్రత్యక్షంగా నివారించడం ఎంత ముఖ్యమో, పరోక్షంగా పంటలకు మేలు చేకూర్చే మిత్ర పురుగులను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. క్రిమి సంహారక మందులు మోతాదుకు మించి వినియోగించడం వల్ల, శత్రు పురుగులతో పాటు పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగుల జాడ లేకుండా పోతోంది. వ్యవసాయ అధికారులు ఎంత మొత్తుకున్నా, రైతులు పెడచెవినపెట్టి, సొంత నిర్ణయాలతో క్రిమి సంహారక మందులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. మిత్ర పురుగులు తగ్గిపోడానికి కారణాలను అమలాపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషి వివరించారు. ఆయన మాటల్లో పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు ఇవి.

ట్రైకో గ్రామ...
పంటను ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగులు వాటి సంతతిని గుడ్ల ద్వారా పెంచుతాయి. ఈ పురుగులు పంట ఆకులపైన, పంట లేత భాగాలపైన గుడ్లను పెడతాయి. అలా గుడ్డు నుంచి బయటకు వచ్చిన వాటి సంతతి పూత, ఆకు, పిందెలను తినేసి పంటకు నష్టం కలిగిస్తాయి. ట్రైకో గ్రామ అనే మిత్ర పురుగు పంటపై పచ్చ పురుగు, లద్దె పురుగు పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేయడం ద్వారా శత్రు పురుగుల సంతతి పెరగకుండా చేస్తుంది. అక్షింతల పురుగులు దోమ, నల్లి, తామర తదితర పురుగులను తింటాయి.



అక్షింతల పురుగు



సాలీడు



కందిరీగ



కోకోకొలా బిల్లు పురుగు

సాలీడు, తూనీగ
పచ్చపురుగు, లద్దె పురుగులు పంటలపై పెట్టిన గుడ్ల నుంచి బయటకు వచ్చే సంతతి పురుగులు, రెక్కల పురుగులు, దోమలు, నల్లులు సాలీడు గూళ్లలో ఇరుక్కుపోతాయి. వాటిని సాలీడు ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా నివారిస్తుంది. మరో పంట మిత్ర పురుగు అయిన తూనీగ.. పంటలపై పెట్టిన చీడ పరుగుల గుడ్లను తినడమే కాకుండా, మంచి పంట దిగుబడులకు దోహదపడతాయి.

మరికొన్ని మిత్ర పురుగులు
కందిరీగ, మిడత, పాడిసన్ బగ్ వంటి మిత్ర పురుగులు సైతం పంటను ఆశించే చీడ పురుగులు పంటపై పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ, వాటి సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా రైతుకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పంటను ఆశించే చీడ పురుగులను నివారించడంలో ఎంతో సాయం చేస్తున్నాయి. రైతుల నిర్లక్ష్యం కారణంగా మిత్ర పురుగులు నశించిపోతున్నాయి. పలు రకాల క్రిమి సంహారక మందులు అతిగా పిచికారీ చేయటం వల్ల ఇలా జరుగుతోంది.

అవసరం మేరకే మందుల వినియోగం



పంటలకు క్రిమి సంహారక మందులు అవసరం మేరకే వినియోగించాలి. కానీ కొందరు రైతులు మోతాదుకు మించి పిచికారీ చేస్తున్నారు. దీంతో పంటకు, రైతులకు ఎంతో మేలు చేకూర్చే పంట మిత్ర పురుగులు క్రమంగా నశించిపోతున్నాయి. పంటపై ఒకటి, రెండు చీడ పురుగులు కనపడినంత మాత్రాన వెంటనే మందులు వాడాల్సిన అవసరం లేదు. పర్యావరణం ద్వారా, లేదా మిత్ర పురుగుల ద్వారా అవి నశిస్తాయి. అవి మరీ ఎక్కువైతే, అవసరం మేరకు మందులు వాడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు క్రమేపీ క్రిమిసంహారక మందులకు స్వస్తిచెప్పి, ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి. తద్వారా మిత్ర పురుగులను కాపాడటంతో పాటు భూమికి మేలు చేకూర్చిన వారవుతారు.

– ఎంఎ షంషి, ఏడీఏ, అమలాపురం

వివాహిత నిరసన

అల్లవరం: భర్తతో కాపురం చేయనీయకుండా అత్త, భర్త సోదరుడు అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ ఓ వివాహిత అల్లవరంలో గురువారం సాయంత్రం నిరసన చేపట్టింది. ఆమె కథనం ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన వివాహితకు అల్లవరానికి చెందిన సూర్యప్రకాష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది పాప ఉంది. ఆ పాప కడుపులో ఉండగా, వివాహిత అనారోగ్యం పాలైంది. దీంతో అత్తంటివారు ఆమెను దూరం పెట్టారు. ఆమె రాజమహేంద్రవరంలోని పుట్టింట్లోనే ఉంటోంది. తన భర్త కాపురం చేయడానికి ఇష్టపడడం లేదంటూ గురువారం ఆమె అత్తింటి ముందు నిరసన చేపట్టింది. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. అత్తింటి వారే తనకు లేని రోగం అంటగట్టారని వివాహిత ఆరోపించింది. రెండు నెలల క్రితం రాజమహేంద్రవరం దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొంది. కాగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చిన ప్పటికీ, ఆమె నిరసన కొనసాగిస్తోంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: అల్లవరం సబ్ స్టేషన్ పరిధిలోని గోడి, గోడిలంక, అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పేరూరు నుంచి గోడిలంక వరకు రోడ్డు విస్తరణ నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు మార్పు చేయడానికి సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

రక్తదానం చేయడం అభినందనీయం

మంత్రి విశ్వరూప్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ఆపద సమయంలో ప్రాణం కాపాడే రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా భట్నవిల్లిలో వారి నివాసం వద్ద గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మంత్రి విశ్వరూప్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. మంత్రి విశ్వరూప్ భారీ కేక్ కట్ చేసి, శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు భారీ గజమాలతో మంత్రి విశ్వరూప్, శ్రీకాంత్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి, గెద్దం సంపదరావు, పట్టణ, రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సంసాని నాని, బొంతు గోవిందశెట్టి, తుని, గన్నవరం నియోజకవర్గాల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పి.చిట్టిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ముమ్మిడివరం మున్సిపల్ చైర్మన్ కడిమి ప్రవీణ్, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, డీసీసీబీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పొన్నాడ



కొమానపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామని, ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం కొమానపల్లి పంచాయతీ పరిధిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు అందజేశారు. ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని, స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణకుమార్, సర్పంచ్ కాశి ఇందిర, కాశి రామకృష్ణ, కోలా బాబ్జి, జగతా పద్మనాభం, ఎంపీటీసీ సాదనాల వీర నాగసుబ్రహ్మణ్యేశ్వరి, నక్కా రామకృష్ణ, బోణం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న చంద్రశేఖర్, సత్యనాగేంద్రమణి



పటవలలో రోగులకు మందులు అందిస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సాగర్

ఐ.పోలవరం: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు అన్నారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు-2 సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు ఇస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో 512 మందికి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాబ్జిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి రంగరాజు, మోకా రవికుమార్, మాజీ జెడ్పీటీసీ కాశి పరివాజ్‌కుమార్, చెల్లి మల్లికార్జునరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో నాణ్యమైన వైద్యం
అల్లవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం లభిస్తోందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. గూడాల సచివాలయంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రోగులకు పరీక్షించి, మందులు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహసారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లసమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో చిన్నారులకు అన్నప్రాసన
అమలాపురం రూరల్: పురపాలక సంఘ పరిధిలోని 13వ వార్డు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం జరిగింది. వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్(నాని) మాట్లాడుతూ వైద్యం కోసం ఎవరూ ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టినట్టు తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో బాలింతలకు కిట్లు అందించి, చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. 350 రోగులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యాధికారి భరతలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, కమిషనర్ అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు కట్టోజు సన్న్యయ్యదాసు. చిట్టూరి పెదబాబు. కొల్లాటి దుర్గాబాయి పాల్గొన్నారు.

పాతకోరంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష
తాళ్లరేవు: మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 480 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులు జయభార్గవి, ఈశ్వర్ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్ రోగులకు మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, పాలెపు పోశియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు రాయుడు గంగాధర్, కొపనాతి నాగరాజు, కామాడి భైరవమూర్తి, లోవరాజు పాల్గొన్నారు.













ఆత్మీయ స్వాగతం

రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ గణేష్ వివాహ రిసెప్షన్ దివాన్‌చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో గురువారం ఘనంగా జరిగింది. వధూవరులైన గణేష్, సుకీర్తిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. ముఖ్యమంత్రిని మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ రావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి, స్వాగతం పలికారు.

కళ్లకు గట్టిన వీరంగం

- ఆకట్టుకున్న చెడీ తాలింఖానా ప్రదర్శన
- అమలాపురంలో ముగిసిన దసరా సంబరాలు

అమలాపురం రూరల్: కత్తుల సమరం.. కర్రల యుద్ధం.. గాలిని చీలుస్తూ అగ్గిబరాటాలు ఓవైపు, శక్తివేషాలు.. కోయి డాన్సులు, డీజే.. తీన్‌మార్ డప్పులతో హోరెత్తిన వీధులు మరోవైపు. వీటితో పాటు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ మధ్య వివిధ రకాల వాహనాలపై అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. కోనసీమ కేంద్రమైన అమలాపురంలో దసరా ఉత్సవాల సంబరాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆరేళ్ల చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ కర్రలు, కత్తులతో చెడీ తాలింఖానా ప్రదర్శన రక్తికట్టించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ కొంకాపల్లి, మహిపాలవీధి, గండువీధి, నల్లా వీధి, రవణం మల్లయ్య వీధి, రవణం వీధి, శ్రీరామపురం చెడీ తాలింఖానా కమిటీల ఆధ్వర్యంలో ఆయుధాల ప్రదర్శన జరిగింది.

వాయిద్యాలు.. ఒంటెలతో ఊరేగింపు
కేరళ కళాకారుల డీజే బ్యాండ్‌లు డప్పు వాయిద్యాలకు యువత చిందేసింది. గండువీధి, రవణంవీధి, నల్లా రవణం మల్లయ్య వీధిలో సుమారు వంద మంది కళాకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఒంటెలతో ఊరేగింపు ఆకట్టుకుంది. విజయవాడ, ఏలూరు, భీమవరం ప్రాంతాల వారి కాళికామాత శక్తివేషాలు విశేషంగా ఆకట్టుకన్నాయి.

ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణ
ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో సీఐలు క్రాంతికుమార్, వీరబాబు ముందస్తుగా రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 16 మంది ఎస్సైలతో పాటు సుమారు 500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.



రవణంవీధిలో మహిషాసురమర్దిని అమ్మవారు



అగ్గిబరాటాల విన్యాసం



ఒంటెలతో నిర్వహిస్తున్న ఊరేగింపు

జట్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

తాళ్లరేవు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ గురువారం పటవలలో ప్రారంభమైంది. స్థానిక పోలిశెట్టి వీరాంజనేయులు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ రాయుడు సునీత దీనిని ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించి, జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్టు స్కూల్ పీడీ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీవీ ప్రసాద్, కాకినాడ పీఈటీ సంఘ ప్రెసిడెంట్ వి.మాచరరావు పాల్గొన్నారు.

శ్రీరంగనాయకపురంలో అయోధ్య రాముని పాదుకలు

తాళ్లరేవు: అయోధ్య రాముని పాదుకలు తాళ్లరేవు మండలం శ్రీరంగనాయకపురంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చాయి. అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లా శ్రీనివాస శాస్త్రి తయారు చేయించిన శ్రీరాముని పాదుకలను అయోధ్య రామునికి సమర్పించే క్రమంలో భాగంగా దేశమంతా ఊరేగిస్తున్నారు. స్వామివారి పాదుకలకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వీటిని స్థానిక గణపతి దేవాలయానికి, కోదండ రామాలయానికి తీసుకువచ్చారు. పంచామృతాలతో శ్రీరాముని పాదుకలను అభిషేకించారు. అనంతరం గుత్తులవారిపాలెం రామాలయంలో పూజలు చే శారు. ఫౌండేషన్ ప్రతినిధి చల్లా శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ ఈ పాదుకలు వచ్చే ఏడాది జనవరి 15కు అయోధ్య చేరనున్నట్టు తెలిపారు.



అయోధ్య శ్రీరాముని పాదుకలు